## దటీజ్ తెలంగాణ

సమైక్య రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో 24,086 ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేయగా, తెలంగాణకు దక్కినవి కేవలం 10,080. బీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చాక 2014 నుంచి 2023 వరకు 2,32,308 ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



సంక్షేమం

రాష్ట్రంలోని అన్నివర్గాల వారి అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నది. జనాభాలో ఎక్కువ శాతం ఉన్న బీసీలకు కూడా ఆత్మగౌరవ భవనాలను నిర్మించి వారికి అన్ని విధాలుగా సముచిత స్థానాన్ని కల్పిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం.

ఆత్మగౌరవ భవనాలు

ప్రారంభం **2018**

మనమే నంబర్ 1

కొత్త దశకు.. ప్రగతి దిశకు నిలువెత్తు నిదర్శనం తెలంగాణ. ఇది గప్పాలకు పోతూ చెప్పుకుంటున్న మాట కాదు. యావత్తు భారతావని అంగీకరిస్తున్న వాస్తవం. తొమ్మిదేండ్ల ముందు పసికూనగా బుడిబుడి అడుగులతో నడకను ప్రారంభించిన తెలంగాణ.. ఇప్పుడు దేశానికే మార్గదర్శిగా నిలిచింది. దేశ ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా భావించే 12 అంశాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతి ఆద్యంతం అద్భుతమే. ఆ పన్నెండు విజయాల్లో ఒకటి జీఎస్డీపీ. తొమ్మిదేండ్లలో తెలంగాణ జీఎస్డీపీ పైపైకి పాకిన తీరుతెన్నులు మీకోసం...

# జీఎస్డీపీ పైపైకి..

### తొమ్మిదేండ్లలో మూడింతలు పెరిగిన జీఎస్డీపీ

ఒక రాష్ట్ర ప్రగతికి జీఎస్డీపీ, తలసరి ఆదాయమే ప్రామాణికం. దేశ జనాభాలో 2.9 శాతం వాటా మాత్రమే ఉన్న తెలంగాణ.. దేశ జీడీపీలో 4.9 శాతం వాటాను కలిగి ఉంది. 2013-14లో తెలంగాణ జీఎస్డీపీ రూ.3.79 లక్షల కోట్లుగా ఉంటే, 2023 నాటికి రూ. 13.28 లక్షల కోట్లకు చేరింది. తొమ్మిదేండ్లలో జీఎస్డీపీ మూడురెట్లు పెరిగింది. 2020-21లో ఒకవైపు కరోనా సంక్షోభం యావత్తు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసినా, కేంద్రం ఏకాణా ఇవ్వకున్నా తెలంగాణ మాత్రం వెనుదిరిగి చూడలేదు. ఆ సమయంలో దేశ జీడీపీ -1.4 శాతానికి పడిపోగా, రాష్ట్రం మాత్రం 1.2 వృద్ధిరేటును నమోదు చేసింది.




**తొమ్మిదేండ్లలో జీఎస్డీపీలో మార్పు ఇది**

2014: రూ. **3.79** లక్షల కోట్లు
2023: రూ. **13.28** లక్షల కోట్లు
పెరుగుదల : **251** శాతం

విశేషం: ఒక్క ఏడాదిలో తెలంగాణ నమోదుచేసే జీఎస్డీపీతో మన పొరుగున ఉన్న భూటాన్‌ను 52 ఏండ్లపాటు పోషించవచ్చు.

### దేశ జీడీపీ, తెలంగాణ జీఎస్డీపీ (రూ. కోట్లలో)

| సంవత్సరం | తెలంగాణ జీఎస్డీపీ | దేశ జీడీపీ | జీడీపీలో తెలంగాణ వాటా (శాతాల్లో) |
|---|---|---|---|
| 2013-14 | 3,79,000 | 1,12,33,511 | 3.37 |
| 2014-15 | 5,05,849 | 1,24,67,959 | 4.05 |
| 2015-16 | 5,77,902 | 1,37,71,874 | 4.19 |
| 2016-17 | 6,58,325 | 1,53,91,669 | 4.27 |
| 2017-18 | 7,50,050 | 1,70,90,042 | 4.38 |
| 2018-19 | 8,57,427 | 1,88,99,668 | 4.53 |
| 2019-20 | 9,48,356 | 2,00,74,856 | 4.72 |
| 2020-21 | 9,69,656 | 1,98,00,914 | 4.89 |
| 2021-22 | 11,54,846 | 2,36,64,639 | 4.88 |
| 2022-23 | 13,28,000 | 2,72,03,767 | 4.89 |




నల్లగొండలో నిర్మించిన ఐటీ టవర్

## ఉన్న ఊర్లోనే
# ఐటీ జాబ్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే హైదరాబాద్, బెంగళూరుతో పాటు ఇతర పెద్ద పట్టణాలు, విదేశాల్లో మాత్రమే అందుబాటులో ఉండేవి. కానీ.. తెలంగాణ సిద్ధించిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లా కేంద్రాల్లో సైతం ఐటీ టవర్ల నిర్మాణంతో సాఫ్ట్‌వేర్ కొలువులు అందుబాటులోకి వచ్చాయి. అమ్మానాన్నలకు, ఇంటి వాతావరణానికి దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదివిన యువతకు మన దగ్గరే ఐటీ కొలువులు దొరుకుతుండటంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

... బొడ్డుపల్లి రామకృష్ణ

- సమాచార సాంకేతిక రంగంలో నల్లగొండకు ప్రత్యేక స్థానం
- పట్టణంలో సర్వాంగ సుందరంగా నిర్మితమైన ఐటీ టవర్
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, మంత్రి కేటీఆర్ చొరవ
- మరో మదాపూర్.. హనుమకొండ జిల్లా మడికొండ

### తొలి విడుతలో 16 కంపెనీలు

నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన ఐటీ టవర్‌ను ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. తొలి విడుతలో 16 కంపెనీలు 170 మందికి వివిధ కేటగిరీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించాయి. రాబోయే రోజుల్లో మూడు షిఫ్టుల్లో పని చేస్తే 3,400 మంది, రెండు షిఫ్టుల్లో అయితే 2,300మంది, ఒక షిఫ్టులో 1,500 మంది పని చేయడానికి అవకాశం ఉన్నది. త్వరలో ఆయా కంపెనీలు రెండో విడుతలో నిర్వహించే జాబ్‌మేళాలో ఆయా ఉద్యోగాలను భర్తీ చేయనుండగా స్థానిక యువతకు సొంత ఊళ్లోనే ఉద్యోగాలు దక్కనున్నాయి.

### ఐటీ టవర్‌లో కొలువు



నా చదువంతా నల్లగొండలోనే సాగింది. ఆ తర్వాత ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లా. వివాహం కావడంతో మళ్లీ నల్లగొండకే రావాల్సి వచ్చింది. టీచర్‌గా పనిచేశా. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటీ టవర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించడంతో హాజరయ్యా. ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యి కోణం ఫౌండేషన్‌లో డాటా ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించా. దీంతో నా భర్త, అమ్మానాన్న, అత్తామామలు చాలా సంతోషంగా ఉన్నారు.

- గునుశెట్టి శ్వేతానాయుడు, కోణం ఫౌండేషన్ డాటా ఇంజినీర్, నల్లగొండ




మడికొండ ఐటీ పార్కులోని సైయెంట్ కార్యాలయం

### మడికొండ మరో మాదాపూర్

హనుమకొండ జిల్లాలోని మడికొండ మరో మాదాపూర్‌గా మారుతున్నది. సీఎం కేసీఆర్ హైదరాబాద్ తర్వాత వరంగల్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మడికొండ శివారులో సుమారు 45 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఐటీ పార్కులో ప్రఖ్యాత ఐటీ కంపెనీల స్థాపనకు కృషి చేశారు. మంత్రి కేటీఆర్ ప్రోత్సాహంతో జెన్‌పాక్ట్, టెక్ మహేంద్ర, సైయెంట్, కాకతీయ, వెంటాయిస్, క్వాడ్రంట్ వంటి కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించాయి. ఇంక్యుబేషన్ సెంటర్‌లో జెన్‌పాక్ట్, టెక్ మహేంద్ర కంపెనీల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ రెండు వేల మంది వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు.

... చిలువేరు సంతోష్

### కుటుంబంతో సంతోషంగా ఉన్న..



మెట్రోపాలిటన్ నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తే రూ.60 వేల నుంచి రూ.లక్షకు పైగా జీతం వస్తుంది. కానీ ఖర్చులు కూడా అంతే ఉంటాయి. సొంత జిల్లాలోనే ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయడంతో సంతోషంగా జాబ్ చేసుకుంటున్నాను. ఇక్కడ ఖర్చు కూడా తక్కువే. హైదరాబాద్ వంటి నగరాల్లో ఆఫీస్‌కు వెళ్లాలంటే పెద్ద ప్రహసనం. ఇక్కడయితే ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్లి రావొచ్చు.

- దివాకర్‌రెడ్డి, ఐటీ ఉద్యోగి, వెంటాయిస్ ఐటీ సొల్యూషన్


### సొంత జిల్లాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం




మాది నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లి. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో సంస్థలో ఉద్యోగంలో చేరాను. ఆ క్రమంలోనే డాటా సైన్స్ కోర్సు నేర్చుకున్నా. నల్లగొండలో ఐటీ టవర్‌లో ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించడంతో ఇంటర్వ్యూలకు హాజరయ్యా. డాటా సైన్స్‌లో ఉద్యోగం వచ్చింది. ఇక్కడే జాబ్ చేస్తూ సొంతూరుకు వెళ్తూ అమ్మానాన్నలకు ఆసరాగా ఉంటున్నా. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

- జూలకంటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి, డాటా సైంటిస్ట్, ఐటీ హబ్, నల్లగొండ

## సోషల్ యాంగిల్



వస్తడు సెల్లె
పగటి దొంగల తరిమేందుకు..
మళ్లస్తడు అక్క
ముంగటుండి నడిసేందుకు..
జై కొడుదాం రన్న
'గులాబీ' వనంల మొల్సిన నాయకుడికి.



మెదల కండువేదైనా
గుండెల్లో కేసీఆరే..
గుర్తులెన్నున్నా
ఓట్లు రాలేది కారుకే..
సర్వే ఏదైనా
జనం సంక్షేమం వైపే..
ఎజెండాలెన్నున్నా
ఎగిరేది గులాబీ జెండానే.

-సురేందర్ బండారు

## షహర్ కీ బాత్

### సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఆదుకుంటున్నది. నగరంలోని నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రైడ్, ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా అనేక సంక్షేమ పథకాలు ఇప్పటికే అమలు చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. అణగారిన వర్గాలకే కాకుండా ఉన్నత కులాల్లోని పేదలకు కూడా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న మంచి నాయకుడు సీఎం కేసీఆర్. ఇతర దేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే వారికి ప్రభుత్వం రూ. 20లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. చేతివృత్తులకు చేయూతనిస్తున్నది. హెయిర్ కటింగ్ షాపులతోపాటు రజకులకు ఉచితంగా కరెంటును అందజేస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నది.

- చెన్న స్వామి, ఎర్రగడ్డ, ప్రైవేట్ ఉద్యోగి

# ఆయకట్టు కళకళ

### విజయంపై గండ్ర వెంకటరమణారెడ్డి ధీమా



▪ ఏరియల్ వ్యూ: భూపాలపల్లి



శాయంపేట నియోజకవర్గంలో ఉన్న భూపాలపల్లి 2009లో నియోజకవర్గంగా ఏర్పడింది. 2009లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి వెంకట రమణారెడ్డి, 2014లో టీఆర్ఎస్ నుంచి మధుసూదనాచారి, 2018లో కాంగ్రెస్ నుంచి వెంకట రమణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరారు.

భూపాలపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నది. విద్య, వైద్యం, రవాణా వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. నాటి కుగ్రామం నేడు మున్సిపాలిటీగా మారింది. అధునాతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వంద పడకల దవాఖాన, డయాగ్నొస్టిక్ హబ్, దివ్యాంగుల సంక్షేమ భవనాలు ఏర్పాటయ్యాయి. మెడికల్ కళాశాల, 300 పడకలతో మరో దవాఖాన, ఆయుష్ వైద్యశాల, సమీకృత కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయ సముదాయాలు నిర్మాణంలో ఉన్నాయి.

నియోజకవర్గంలో ప్రభుత్వం సాగునీటి రంగానికి పెద్దపీట వేసింది. దేవాదుల ఎత్తిపోతల్లో భాగంగా రూ.1,348.96 కోట్లతో భూపాలపల్లి మండలం.. భీం ఘన్‌పూర్‌లో 3వ పంపుహౌస్ నిర్మాణంతో పాటు భీం ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి రామప్ప చెరువు వరకు 25.3 కిలోమీటర్ల మేర మూడు పైపులైన్లు నిర్మించింది. మూడో పంపుహౌస్‌లో 22 మెగావాట్ల సామర్థ్యం గల మూడు విద్యుత్ మోటర్లను అమర్చింది.

### 55,301 ఎకరాల ఆయకట్టు

నియోజకవర్గంలో మొత్తం 618 చెరువులు ఉండగా 55,301 ఎకరాలు సాగవుతున్నది. ఎస్సారెస్పీ డీబీఎం 38 కింద రేగొండ, చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, గణపురం మండలాల్లోని చెరువులకు సాగునీరు అందుతున్నది. రామప్ప సరస్సు నుంచి గణప సముద్రం రిజర్వాయర్‌లో గోదావరి జలాలను నింపడానికి రూ.15.17 కోట్లతో 2.81 కిలోమీటర్ల ఫీడర్ చానెల్‌ను నిర్మించారు.

### నాణ్యమైన విద్యుత్

చెల్పూర్ కేటీపీపీ రెండో దశ 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారు. ఆరు నూతన సబ్ స్టేషన్లను నిర్మించింది. చిట్యాల, రేగొండ, జంగేడుల్లో విద్యుత్ పరికరాల మరమ్మతు కేంద్రాలను నెలకొల్పింది.

### దవాఖానల నిర్మాణం.. వైద్య వసతుల పెంపు

పట్టణంలో రూ.29.46 కోట్లతో 100 పడకల దవాఖానను ప్రభుత్వం నిర్మించింది. రూ.11 లక్షలతో పాలియేటివ్ సేవా కేంద్ర (పీఆర్) భవనం, రూ.16.60 లక్షలతో ఆర్‌టీపీసీఆర్ ల్యాబొరేటరీ, రూ.54 లక్షలతో 20 పడకల పిల్లల సంరక్షణ విభాగం, రూ.కోటీ 25 లక్షలతో డయాగ్నొస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేసింది. గ్రామీణ విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలను మంజూరు చేసింది.

### కలెక్టరేట్ , పోలీసు కార్యాలయాలు నిర్మాణం

రూ.68.25 కోట్లతో జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంతో పాటు అధికారుల కోసం 10 క్వార్టర్ల నిర్మాణాన్ని చేపట్టింది. రూ.86 కోట్లతో మూడంతస్తుల జిల్లా పోలీస్ కార్యాలయ సముదాయం, ఎస్పీ క్యాంపు, ఏఆర్ హెడ్‌క్వార్టర్ భవనాలు, మెన్ బ్యారక్ పనులు కొనసాగుతున్నాయి.

### 29 రైతు వేదికల నిర్మాణం

రూ.22 లక్షల చొప్పున 29 రైతు వేదికలను ప్రభుత్వం నిర్మించింది. భూపాలపల్లిలో రూ.3 కోట్లతో బీసీ బాలుర వసతి భవనం, రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.3 కోట్లతో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ భవనాన్ని నిర్మించింది.

... గోపాల్ పిన్నింటి



### ధూం..ధాం.. దావత్..

హైదరాబాద్‌లో శుభకార్యాలు, వేడుకలు చేసుకోవాలంటే పేద, మధ్యతరగతి ప్రజలకు తలకుమించిన భారమనే చెప్పాలి. చిన్నపాటి ఫంక్షన్ హాల్‌కు సైతం రూ.50 వేల వరకు అద్దెను వసూలు చేస్తున్నారు. ఈ కష్టాలను గుర్తించిన సీఎం కేసీఆర్ నగరంలో అనేక చోట్ల ప్రభుత్వ మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో అందుబాటులో ఉండగా మోడ్రన్ డిజైన్, అత్యాధునిక వసతులు, పార్కింగ్‌తో పాటు గ్రాండ్ లుక్‌తో వీటిని ఏర్పాటు చేశారు.

